క్లుప్తంగా

ఖాద్రీ ఆలయ అర్చకుడికి సత్కారం



వెంకట నరసింహాచార్యుడిని సత్కరిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: తిరుపతిలో గురువారం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా విశ్వవిద్యాలయం వారు ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రధాన అర్చకులు ధాలిపట్టం వెంకట నరసింహాచార్యులకు వైఖానస ఆగమరత్న, వైఖానస ఆగమవిద్యావన్ బిరుదులు ప్రదానం చేయడంతోపాటు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

ముస్లింలకు సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న టిప్పుసుల్తాన్ ఖిద్మత్ టీం సభ్యులు

ధర్మవరం అర్బన్: స్థానిక పీఆర్‌టీవీధిలో ఉన్న షాదీమహల్‌లో గురువారం హజరత్ టిప్పుసుల్తాన్ ఖిద్మత్ టీం సభ్యులు పేద ముస్లిం కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రంజాన్ సందర్భంగా పేద కుటుంబాలకు తమవంతుగా సాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు. హజరత్ టిప్పుసుల్తాన్ ఖిద్మత్ టీం సభ్యులు, ముతవల్లిలు పాల్గొన్నారు.

రోగులకు అన్నదానం



రోగులకు భోజనం వడ్డిస్తున్న ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ మాధవి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో గురువారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి రోగులకు స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అన్నదానం చేస్తున్నామన్నారు. యువర్స్ ఫౌండేషన్ సభ్యులు వైకే శ్రీనివాసులు, కోటేశ్వరరావు, సత్రశాల మల్లికార్జున, కౌన్సిలర్ కేతా లోకేష్, గుండా పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి జూడో పోటీలకు చిగిచెర్ల విద్యార్థిని



విద్యార్థిని లాస్యరెడ్డితో పీడీ ప్రతాప్‌రెడ్డి

ధర్మవరం రూరల్: జాతీయ స్థాయి జూడో పోటీలకు చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని లాస్యరెడ్డి ఎంపికైనట్లు పాఠశాల పీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 17 వరకు విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ జూడో పోటీలలో లాస్యరెడ్డి 48 కేజీల విభాగంలో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించిందన్నారు. మార్చి 28 నుంచి 31 వరకు ఉత్తరాఖండ్‌లో జరిగే జూనియర్ జూడో జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పీడీతో పాటు ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు

ధర్మవరం రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని గొట్లూరు సర్పంచ్ పిట్టా నరసమ్మ అన్నారు. గురువారం గొట్లూరు గ్రామంలో తడి, పొడి చెత్త నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను వేరుచేయడం, సేంద్రియ ఎరువుల తయారీ, వ్యర్థాల నిర్వహణలో శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత పెంపు చర్యలు తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు, సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు కట్టుబడి వెంకటేష్, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కోర్కెలు నెరవేర్చే అక్కదేవతలు



ఒంటికొండ గ్రామంలోని అక్కదేవతల మూల విరాట్



మేడాపురంలో లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం



అలంకరణలో లక్ష్మీనరసింహుడు

- నేటి నుంచి 31వ తేదీ వరకూ ఉత్సవాలు
- ఒంటికొండ గ్రామంలో ఏర్పాట్లు పూర్తి
- పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు

చెన్నేకొత్తపల్లి: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అక్కదేవతల ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మండల పరిధిలోని వెంకటంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఒంటికొండ గ్రామంలో ఏటా ఉగాది పండుగను పురస్కరించుకుని అక్కదేవతల ఉత్సవాలను నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ఈనెల 28వ తేదీన ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు. 31వ తేదీ వరకూ ఉత్సవాలు జరగనున్నాయి. 28న ఒంటికొండ నుంచి పూజారితో పాటు మరికొందరు భక్తులు పాదయాత్రగా కొత్తచెరువు మండలం లింగారెడ్డిపల్లికి వెళ్తారు. అక్కడి నుంచి ఎలవగంప తీసుకొస్తారు. మరుసటి రోజు ఒంటికొండ నుంచి గిరిగిలు (దేవత ప్రతిమలు) ఆభరణాలను కొత్తచెరువు మండలం కొడపగానపల్లికి తీసుకెళ్లి అక్కడ వాటిని అలంకరిస్తారు. తిరిగి ఎలవ గంపను తలపై ఉంచుకుని పాదయాత్రగా ఒంటికొండ గ్రామానికి ఉగాది పండుగ రోజు ఉదయానికి చేరుకుంటారు. గ్రామంలో అక్కదేవతలతో పాటు నరసింహస్వామి, చెన్నుడు దేవతలను మేళతాళాలతో ఊరేగిస్తారు. భక్తులు తమ కోర్కెలు నెరవేరాలని స్వామి ముందు మొకరిల్లి వేడుకుంటారు. ఇలా చేయడం వల్ల కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. 31వ తేదీన గ్రామంలో ఆడపిల్లలకు అక్కదేవతల కొలనులో స్నానాలు చేయిస్తారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం నుంచి భక్తులు కుంకాలు వేసుకుంటారు. ఈ ఉత్సవాలను చుటుపక్కల గ్రామాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివస్తారు. ఉత్సవాల ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకూ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేస్తారు.

రేపటి నుంచి మేడాపురంలో..

- లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలకు సర్వం సిద్ధం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని మేడాపురం గ్రామంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు ఈనెల 29వ తేదీన (శనివారం) ప్రారంభవుతాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఏటా ఉగాది పండుగను పురస్కరించుకుని స్వామివారి ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శనివారం ఉదయం నుంచి దేవాలయంలో స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం గ్రామ సమీపంలోని గుట్టలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి ప్రతిమలను (గిరిగెలు) తీసుకొస్తారు. వాటిని అత్యంత భక్తిశ్రద్ధలతో తెల్లటి నూతన వస్త్రంలో చుట్టుకుని గ్రామానికి ఊరేగింపుగా తీసుకొస్తారు. అనంతరం స్వామి ప్రతిమలకు వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య ఆభరణాలను అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఉత్సవ ప్రతిమలను గ్రామంలో మేళతాళాలతో ఊరేగిస్తారు. భక్తులు స్వామి వారి ముందు కోర్కెలు నెరవేర్చాలని మొకరిల్లుతారు. స్వామి వారి ఊరేగింపులో కోలాటం, భక్తిగీతాల ఆలాపన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. గోవింద నామస్మరణతో గ్రామం మార్మోగుతుంది. ఉదయానికి స్వామిని ఊరేగింపుగా దేవాలయానికి చేరుస్తారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అన్నదానం చేస్తారు. ఈ ఉత్సవాలకు పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామికి ఫల, పుష్పాలనను సమర్పించి పూజలు చేయిస్తారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను అడ్డుకున్న పోలీసులు



నాయకులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

చెన్నేకొత్తపల్లి: రామగిరి ఎంపీపీ ఎన్నిక సందర్భంగా గురువారం ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎస్ఎస్ గేట్‌లో రామగిరికి వెళ్లే కూడలిలో పోలీసులు ఉదయం నుంచే తనిఖీలు చేపట్టారు. టీడీపీ సానుభూతిపరులు గుంపులుగా చేరడంతో డీఎస్పీతో పాటు సీఐలు చెదరగొట్టారు. గుంపులుగా చేరితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చెన్నేకొత్తపల్లికి చేరుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ రామగిరి ఎంపీపీ ఎన్నికపై పార్టీ శ్రేణులతో చర్చించారు. విషయం తెలుసుకున్న ధర్మవరం సీఐతో పాటు మరొక సీఐ, ఎస్ఐలు అక్కడికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి వెళ్లి పోవాలని జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు నాయకులు, కార్యకర్తలకు సూచించారు. తాము ప్రశాంతంగా ఉండి చర్చించుకుంటున్నామని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకుంటామని మండల నాయకులు, జెడ్పీ చైర్‌పర్సన్ పోలీసులకు సమాధానం ఇచ్చారు. అయినప్పటికి ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించారు. దీంతో చేసేది లేక జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నాయకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందరెడ్డి, కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల గృహ నిర్బంధం





కదిరిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్‌అహ్మద్, పూల శ్రీనివాసులరెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

గాండ్లపెంట: గాండ్లపెంట ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో గురువారం పోలీసులు వైఎస్సార్‌సీపీ నాయకులను గృహ నిర్బంధం చేశారు. కదిరిలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్‌అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసులరెడ్డిని ఎక్కడికి వెళ్లకుండా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా నాయకులు తీరును తప్పుబట్టారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో అధికారుల నిర్లక్ష్యం



విద్యుత్ శాఖ కార్యాలయంలో ఉన్న టాన్స్‌ఫార్మర్లను చూపుతున్న రైతులు

ఎన్‌పీకుంట: ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు వాపోయారు. గురువారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద గురువారం బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సమీఉల్లా, పలువురు రైతులు ఆందోళన చేపట్టారు. ఏడాది క్రితమే డిపాజిట్లు చెల్లించినా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల అందించడం లేదని రైతులు ధనియానిచెరువు చలపతి, దిన్నిమీదపల్లి ఇంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. కార్యాలయంలో ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉన్నప్పటికీ సాకులు చెపుతూ కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం ఎండలు అధికమై పంటలు ఎండుతున్నాయన్నారు. లోఓల్టేజీ సమస్యతో పంటలకు నీరు అందడం లేదని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయమై బీజేపీ నాయకులు విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్లో మాట్లాడగా పది మంది రైతులకు సంబంధించి 7 ట్రాన్స్‌ఫార్మర్లు వచ్చాయని, మిగిలిన మూడు ట్రాన్స్‌ఫార్మర్‌లు వచ్చేవి ఉన్నాయని వచ్చిన వెంటనే రైతులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సమీవుల్లా, ఇంతియాజ్, రైతులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం, నాటుసారా అరికట్టాలి



మాట్లాడుతున్న డిప్యూటీ కమినర్ నాగమద్దయ్య

తనకల్లు: గ్రామాల్లో కర్ణాటక మద్యం, నాటుసారాను అరికట్టాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమినర్ నాగమద్దయ్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్టుషాపులను నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. నవోదయం 2.0 కార్యక్రమాన్ని ద్వారా నాటుసారాపై అవగాహన కల్పించాలని సూచించారు. నాటుసారా విక్రేతలను గుర్తించి తహసీల్దార్ ముందు బైండోవర్ చేయాలన్నారు. నాటుసారా తయారీ దారులకు బెల్లం అమ్మే కిరాణాదుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. నాటుసారా తయారి, రవాణాకి స్వస్తి పలికిన వారికి ప్రత్యామ్నాయ మార్గంలో భాగంగా జీవనోపాధి కోసం సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరనున్నట్లు తెలిపారు. అనంతరం స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్, సీఐ మారుతిరావు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ గడువు పొడిగించాలి



ఆర్డీఓ మహేష్‌కు విన్నవిస్తున్న సీపీఎం నాయకులు

ధర్మవరం: రేషన్‌కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకునేందుకు గడువు పొడిగించాలని సీపీఎం నాయకులు కోరారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఆర్డీఓ మహేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మారుతి, ఎస్‌హెచ్‌బాషా, జేవీ రమణ మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం చెప్పడంతో కార్డుదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ- కేవైసీ పని చేయకపోవడంతో వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పరీక్షల నేపథ్యంలో దూరప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు ఈ-కేవైసీ చేయించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హైదర్‌వలి, హరి, ఎల్.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: రేషన్‌కార్డుదారులు ఈకేవైసీ చేయించుకునేందుకు గడువు పొడిగించాలని వ్యవసాయ కార్మిక సంఘం(సీపీఐ) నాయకులు అధికారులను కోరారు. ఈమేరకు గురువారం ఆర్డీఓ కార్యాలయ ఏఓ గురుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి కదిరప్ప మాట్లాడుతూ ఈ నెల 30 తేదీలోపు ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం చెప్పడంతో కార్డుదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈకేవైసీ గడువును మరో నెల పాటు పెంచాలని కోరారు.

నేడు రీసర్వేపై గ్రామసభలు

ఎన్‌పీకుంట: వంకమద్ది, పెడబల్లి పంచాయతీల్లో శుక్రవారం భూ రీసర్వే కార్యక్రమంపై గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ దేవేంద్రనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వీఆర్‌ఓలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. రీసర్వే భూసమస్యలు పరిష్కారమవుతాయని, కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ ఇస్తున్న జెడ్‌బీఎన్‌ఎఫ్ సిబ్బంది

కనగానపల్లి: రైతులకు ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకంగా ఉంటుందని జెడ్‌బీఎన్‌ఎఫ్ మాస్టర్ ట్రైనర్ పెద్దిరెడ్డి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం వచ్చే ఖరీఫ్ పంటల సాగు మాస్టర్ ప్లాన్‌పై వ్యవసాయాధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం పద్ధతులు, ఉపయోగాలపై జెడ్‌బీఎన్‌ఎఫ్ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. క్రిమి సంహారక మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయంలో పంటలు సాగు చేయడం పెట్టుబడులు తగ్గటంతో పాటు ఆహార పదార్థాలు విష పూరితం కాకుండా ఉంటాయని వివరించారు. అనంతరం ఆవు పేడ, గంజు ద్వారా తయారు చేసే సేంద్రియ ఎరువులు, కషాయాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణకుమారి, ఏపీఎం హేమలత, జెడ్‌బీఎన్‌ఎఫ్ సిబ్బంది, సీసీలు, వీఏఏలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: గొల్లపల్లి వంక వద్ద ఓ వ్యక్తి విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్ కూలి పని చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుటుంబ కలహాలతో తీవ్ర మనస్థాపానికి గురైన అతడు గురువారం గొల్లపల్లి వంక వద్ద విషద్రావకం తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

గిరిజనుల భూముల ఆక్రమణపై ఫిర్యాదు

ఓడీచెరువు: ముదిగుబ్బ మండలం అడవిబ్రాహ్మణపల్లి తండాలో గిరిజనుల భూముల ఆక్రమణపై జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జటావత్ హుస్సేన్ నాయక్‌కు ఫిర్యాదు చేసినట్లు గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసనాయక్ తెలిపారు. గురువారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గిరిజనుల భూములను ముదిగుబ్బ ఎంపీపీ నుంచి తిరిగి ఇప్పించాలని హుస్సేన్ నాయక్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి

పుట్టపర్తి టౌన్: పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల మృతిపై నిష్పక్షపాతంగా పోలీసు విచారణ జరపాలని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. గురువారం ఎనుములపల్లి ఎబినేజర్ చర్చిలో విలేరులతో మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ఎన్నో అనుమానాలు ఉన్నాయన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి క్రైస్తవులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు జోషెఫ్, సెక్రటరీ టీ.జోసఫ్, ట్రెజరర్ సురేష్ డేవిడ్, విశ్వా డానియేల్, సోలోమాన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ జాగృతి సంస్థ కోశాధికారిగా చంద్రశేఖర్ గుప్తా

పుట్టపర్తి టౌన్: వాసవీ జాగృతి ఇంటర్నేషనల్ సంస్థ కోశాధికారిగా పుట్టపర్తికి చెందిన సుంకు చంద్రశేఖర్ గుప్తా నియమితులయ్యారు. బుధవారం ఏలూరులో జరిగిన కార్యవర్గం సమావేశంలో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ తిరువీధి వేణుగోపాల్ చంద్రశేఖర్ గుప్తాకు నియామక ప్రతం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్‌లో 20 ఏళ్లపాటు అందించిన సేవలను గుర్తించి తనను సంస్థ కోశాధికారిగా నియమించారన్నారు.

వారపు సంతల వేలం

పుట్టపర్తి టౌన్: మున్సిపల్ కార్యాలయంలో గురువారం చైర్మన్ తుంగా ఓబుళపతి, కమిషనర్ ప్రహ్లాద ఆధ్వర్యంలో పుట్టపర్తి, ఎనుములపల్లి వారపు సంతలతో పాటు సాహెబ్‌చెరువు, ఎనుములపల్లి చేపల చెరువులకు బహిరంగ వేలం నిర్వహించారు. పుట్టపర్తి వారపు సంతను కమ్మవారిపల్లికి చెందిన చిన్న వెంకటరాముడు 8.25 లక్షలకు, ఎనుములపల్లి వారపు సంత ఎనుములపల్లికి చెందిన చిన్నయ్య రూ.4.75 లక్షలకు దక్కించుకున్నారు. డిపాజిట్‌దారులు రాకపోవంతో ఎనుములపల్లి, సాహెబ్ చేపల చెరువుల వేలాన్ని వాయిదా వేశారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

ఎన్‌పీకుంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ.. పఢాయి భీ కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ రాధిక మాట్లాడుతూ 0-3 సంవత్సరాల పిల్లల అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తలను తల్లిదండ్రులకు వివరించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. తల్లి పాల ప్రాముఖ్యతను చార్టుల రూపంలో ప్రదర్శిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నరసమ్మ, లక్ష్మీదేవి, మౌలాబి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి టౌన్: స్థానిక పాలిటెక్నికల్ కళాశాలలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ-పఢాయి భీ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నిహారిక, దీప మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలన్నారు. సూపర్‌వైజర్లు అలీవేలమ్మ, మమత తదితరులు పాల్గొన్నారు.

ఇన్విజిలేటర్లపై సస్పెన్షన్ ఎత్తేయాలి



జెడ్పీహైస్కూల్‌లో సమావేశమైన ఉపాధ్యాయ సంఘాల నాయకులు

కదిరి అర్బన్: పదో తరగతి పరీక్షల్లో ఇన్విజిలేటర్లుగా పని చేసిన ఇద్దరు ఉపాధ్యాయులపై ఉన్నతాధికారులు విధించిన సస్పెన్షన్‌ను తొలగించాలని పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కదిరిలో వివిధ సెంటర్లలో నియమింపబడిన ఇన్విజిలేటర్ల విషయంలో కదిరి ఎంఈఓను దోషిగా చూపించడం, డీఈఓకు ఒక సంఘం తన స్వప్రయోజనాల కోసం ఫిర్యాదు చేయడాన్ని ఖండించారు. సమావేశంలో ఏపీటీఎఫ్, ఎస్టీయూ, వైఎస్సార్‌టీఏ, టీఎన్‌యూఎస్, ఏపీటీఎఫ్-1938 సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: కదిరి బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా పని చేసిన ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సింగిల్ టీచర్లను డ్యూటీలకు వేయకూడదనే నిబంధనలు పక్కన పెట్టిన అధికారులపై చర్యలు తీసుకోకుండా విధులు నిర్వహించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవటం సరికాదని పేర్కొన్నారు.

ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి

కదిరి టౌన్: ఇన్విజిలేటర్ నియామకంలో నిబంధనలు పాటించని కదిరి ఎంఈఓపై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం యూటీఎఫ్ జిల్లా కోశాధికారి డి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు తహీర్‌వలీ, సుబ్బారెడ్డి మాట్లాడుతూ వాస్తవాన్ని పక్కదారి పట్టించేందుకు ఎంఈఓ కొంతమంది ఉపాధ్యాయులను ప్రేరేపించడం దురదృష్టకరమన్నారు. డీఈఓ తక్షణమే ఎంఈఓపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మురుగునీరు రోడ్లపై వదిలితే చర్యలు



మురుగునీటిని రోడ్లపై వదిలిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఈఓపీఆర్డీ మాధవరెడ్డి

ఎన్‌పీకుంట: ఇళ్లలోని మురుగునీరు రోడ్లపై వదిలితే చర్యలు తీసుకుంటామని ఈఓపీఆర్డీ మాధవరెడ్డి ఇంటి యజమానులకు హెచ్చరించారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని పలు వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా చాలా మంది మహిళలు దుస్తులు ఉతికిన నీరు, ఇళ్లలోని మురుగునీటిని రోడ్డుపై వదులుతుండటంతో వారికి నోటీసులు ఇచ్చారు. రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుండటంతో పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇకపై ఇళ్ల నుంచి మురుగునీటిని రోడ్లపై వదిలితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పంచాయితీ కార్యదర్శి రమేష్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న పూల శ్రీనివాసరెడ్డి

కదిరి అర్బన్: మండలంలోని ముత్యాలచెరువు గ్రామంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వరరెడ్డి తల్లి లింగాల సుబ్బమ్మ (85)గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి సుబ్బమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. లోకేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులకు ఆయన సంతాపం తెలియజేశారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ సుజాత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బాలిరెడ్డి

ధర్మవరం: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని 29వవార్డు వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్ కోటిరెడ్డి సుజాత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కోటిరెడ్డి బాలిరెడ్డి తెలిపారు. పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డు కాలభైరవస్వామి ఆలయం వద్ద గురువారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా షబేఖదర్ వేడుకలు

బత్తలపల్లి: మండలంలో షబేఖదర్(షబ్-ఏ-ఖదర్) వేడుకలను వైభవంగా నిర్వహించారు. గురువారం రాత్రి ముస్లింలు జాగారణ చేశారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జాగరణ చేసేవారికి అన్నదానం ఏర్పాటు చేశారు.